జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించండి

ప్రొద్దుటూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వ్యాపారులంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక వివేకానంద హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, బాలాజీ క్లాత్ మార్కెట్‌లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో మీకు ఏ అవసరం వచ్చినా అండగా నిలిచానని, భవిష్యత్తులో కూడా అదే విధంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తప్పకుండా జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వ్యాపారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని అభినందిస్తున్న వ్యాపారులు

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి తనయుడు మల్లెల మురళీధర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ లింగాపురం, మూలవారిపల్లెలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లమాపురం సర్పంచ్ మాచిరెడ్డి కొండారెడ్డి, ఉపసర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీటీసీ నందిమండలం వీరారెడ్డి, లింగాపురం సొసైటీ చైర్మన్ తుపాకుల ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తుపాకుల భాస్కర్ రెడ్డి, జేష్టాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

రాజుపాళెం : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పర్లపాడు గ్రామంలో కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన తనయుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి శనివారం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటికి తిరిగి ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించామని చెప్పారు. అనంతరం పెద్దమ్మ ఆలయం, శివాలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మధుసూదన్ రెడ్డి, వెల్లాల దేవస్థానముల చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి, గుణాల వెంకటపతిరెడ్డి, రమణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లిక, గృహసారథుల కన్వీనర్ పరిమళ, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మళ్లీ అవకాశం ఇవ్వండి

బ్రహ్మంగారిమఠం : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అమలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనయుడు బి.మఠం మండల ఎన్నికల ఇన్‌చార్జి శెట్టిపల్లె అశోక్‌రెడ్డి (బాబ్జీ)ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని నాగిశెట్టిపల్లె పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగిశెట్టిపల్లె, గొల్లపల్లె, నందిపల్లె, గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటువేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు కావాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం అందజేసిన ఘనత జగనన్నదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వాకమల్లు ఆంథోనిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, నిత్యపూజారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రాజానాయుడు, వెంకటయ్య, మణ్యం శంకర్‌రెడ్డి, చాణిక్య, జోగయ్య, మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బరామిరెడ్డి, శేషారెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

దువ్వూరు: అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని, అందువల్ల ఆయనను మరోసారి ఆశీర్వదించాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి కోరారు. శనివారం దువ్వూరులోని దర్గా వీధి, మసీదు వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్ చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సీఎం అయ్యాక ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మండలి జిల్లా చైర్మన్ ఓబుళ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ఓబుళరెడ్డి, నాయకులు మూలెపల్లె అబ్దుల్ వహాద్, పీరు జాతా అతావుల్లా, జెర్రి హరికృష్ణ, వీవీ స్వామి, తుమ్మల చిన్న, కుంపటి ఖాజాపీర్, సర్పంచ్ చెంద్రాయుడు, ఉపసర్పంచ్ కొట్టె మురళి తదితరులు పాల్గొన్నారు.


పర్లపాడులో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరుతున్న రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి


బ్రహ్మంగారిమఠం : ప్రచారం చేస్తున్న అశోక్‌రెడ్డి, నాయకులు


దువ్వూరు: ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో నూతనంగా జరిగిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా శనివారం వేదపండితులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. తుమ్మలపల్లెలో సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన ఆలయ నిర్మాణంతో పాటు గురువారం నుంచి వేదపండితులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ హనుమ సమేత విగ్రహ ప్రతిష్ట, ధ్వజారోహణం, కలశస్థాపన తదితర కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నేడు ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న బండారు రఘురామయ్య

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ తొగటవీరక్షత్రియుల ఆత్మీయ సమావేశం ఆదివారం సాయంత్రం 5 గంటలకు వసంతపేటలోని శ్రీచౌడేశ్వరిదేవి తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు బండారు రఘురామయ్య, గౌరవాధ్యక్షుడు పట్టుపోగుల పుల్లయ్య తెలిపారు. శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో తమ కులస్తుల మద్దతు కోరేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమావేశానికి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా మన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళుతామన్నారు. సమావేశంలో కమిటీ కోశాధికారి బండారు సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులు పల్లా వెంకటసుబ్బరాయుడు, చౌడం వెంకటరమణ, కోశాధికారి కంభం చిన్న పుల్లయ్య, సభ్యుడు మోతుకూరి బాల పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


కొత్తగా ఏర్పాటు చేసిన బోరు

చాపాడు : చాపాడులో రూ.8లక్షలతో తాగునీటి సమస్యను పరిష్కరించారు. వేసవి కాలం దృష్ట్యా చాపాడులోని రెండు బోర్లలోని భూగర్భజలాల నీటి మట్టం తగ్గింది. దీంతో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు మంచినీటి సమస్యకు పరిష్కారించారు. మైదుకూరు–ప్రొద్దుటూరు రోడ్డులోని సీతారామాపురం క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా బోరు వేసి, అక్కడి నుంచి పైపులైన్ ఏర్పాటు చేశారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తున్నామని సర్పంచ్ మహబూబ్ బీ తెలిపారు.

మేమున్నాం.. నిర్భయంగా ఓటేయండి


కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

బి.కోడూరు : ఓటర్లందరూ నిర్భయంగా ఓటేయాలని, రక్షణగా తామున్నామని బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ భరోసా ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలతో బద్వేలు రూరల్ సీఐ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలైన తంగేడుపల్లె, ప్రభలవీడు, మేకవారిపల్లె, అంకనగొడుగునూరు, తుమ్మలపల్లె, గుంతపల్లె, మునెల్లి, రాజుపాలెం, ఐత్రంపేట, పాయలకుంట్లలలో కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో బి.కోడూరు ఎస్ఐ జయరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండె పోటుతో ఉపాధ్యాయురాలు మృతి

ప్రొద్దుటూరు కల్చరల్: వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఎం.కృష్ణతులసి శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.కాశీప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చైత్రమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన

వైవీయూ : కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. చెన్నైకు చెందిన ఎం.ఆర్.వి.టి క్నాలజీస్ ఆధ్వర్యంలోని లోకేష్ ఇన్ఫోటెక్ సహకారంతో నిర్వహించిన ఈ క్యాంపస్ డ్రైవ్‌లో రాత పరీక్ష, సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 72 మంది విద్యార్థులను బెంగళూరు, చెన్నై కేంద్రాలుగా ఉన్న కంపెనీల్లో ఉద్యోగాలకు రూ.2.50 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేసినట్లు వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డి.మనోహర్‌రెడ్డి తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

బద్వేలు అర్బన్ : ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తనయుడు శెట్టిపల్లె అశోక్‌కుమార్ రెడ్డి (బాబ్జీ) కొనియాడారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలకు, పేదలకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో రెడ్డిసేవా సంఘం అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డి, ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి నారాయణరెడ్డి, బి.మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, బి.మఠం ఎంపీపీ వీరనారాయణ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు నేలటూరి సుబ్బారెడ్డి, రెడ్డిసేవా సంఘం కోశాధికారి నందగోపాల్ రెడ్డి, కార్యదర్శులు వెంకటరామారెడ్డి, శ్రీరాములు రెడ్డి, స్థానిక నాయకులు మల్లేశ్వర్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెడ్డిసేవా సంఘం నాయకులు

ఎన్నికల్లో పీఓ, ఏపీఓలదే కీలకపాత్ర

బద్వేలు అర్బన్ : ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓలదే కీలకపాత్ర అని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాలకు చెందిన పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంల, వీవీప్యాట్‌ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని, అందరి విధులపైన పీఓలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పొరపాట్లకు, తప్పులకు తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా కూడా తమ వ్యక్తిగత అభిప్రాయాలను ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే ముందస్తుగానే మాస్టర్‌ట్రైనీస్ వద్ద నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఎన్నికల డీటీ శ్రీనివాసులు, పీఓలు, ఏపీఓలు, మాస్టర్‌ట్రైనీలు పాల్గొన్నారు.


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకటరమణ

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. రామాపురం రోడ్డు మార్గంలోని గడ్డగుండ్ల రాచపల్లి సమీపంలోని నామాలగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. రెడ్డివారిపల్లి రోడ్డు మార్గంలోని విశ్వభారతి హైస్కూల్ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. నగరంలోని పాత బస్టాండు, బాదుల్లాసాహెబ్ మకాన్ వీధిలోని అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారం, బాలామృతం, టేక్ హోం రేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా పిల్లల బరువు చూడాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సకాలంలో అందేలా చూడాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వ్యాధి నిరోధక టీకాల్లో భాగంగా వ్యాక్సిన్లను జాగ్రత్తగా పరిశీలించి వేయాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లను అవసరమైన సమయంలో పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత, అంగన్వాడీ కార్యకర్త ధనలక్ష్మి, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్లు షంషాద్ బేగం, లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు సర్వేశ్వర్, సుబ్బరాయుడు, శిక్షణా వైద్యులు నవీద్, ప్రశాంత్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంత్ వర్ధన్

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఎర్రగుంట్ల : మండలంలోని ఇల్లూరు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు శనివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో ఆ గ్రామ పార్టీ నాయకుడు మోపూరి దస్తగిరిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. శుక్రవారం బీజేపీలోకి చేరిన వారిలో మరళ కొందరు వైఎస్సార్‌సీపీ విధివిధానాలు మెచ్చి వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు పార్టీ నాయకుడు దస్తగిరిరెడ్డి తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రఘురామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మునిస్వామి, శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డిలు ఉన్నారు.


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

మోడల్ పోలింగ్ కేంద్రం అదరహో

బద్వేలు అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పీఓలు, ఏపీఓలకు పోలింగ్ కేంద్రంపై అవగాహన కల్పించేందుకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని 162వ పోలింగ్ బూత్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం అదరహో అనిపిస్తోంది. పోలింగ్ కేంద్రాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే మార్గాన్ని రంగురంగుల బెలూన్లతో అలంకరించారు. పోలింగ్ కేంద్రం లోపల కూడా గ్రీన్ కార్పెట్ పరిచి బెలూన్లతో అలంకరించారు. పోలింగ్ కేంద్రంలో ఒక పక్క రెండు ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేశారు. పీఓలు, ఏపీఓలు, ఇతర సిబ్బంది కూర్చునేందుకు ఒక పక్క, ఎన్నికల ఏజెంట్లు కూర్చునేందుకు ఒక పక్క కుర్చీలను వేరువేరుగా ఏర్పాటు చేశారు. మొత్తంగా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అదరహో అనేలా తీర్చిదిద్దారు.


పోలింగ్ కేంద్రం లోపల సుందరంగా తీర్చిదిద్దిన అధికారులు

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ఎర్రగుంట్ల : శ్రీ క్రోధినామా సంవత్సర సందర్భంగా హిందూ ఉపాధ్యాయ సమితి ప్రచురించిన నూతన క్యాలెండర్‌ను ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రమరెడ్డి, జేడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రామాంజనేయరెడ్డిలు కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ పండుగను హిందూ ధర్మాన్ని కాపాడిన మహనీయుల చిత్ర పటాలతో హిందూ సంప్రదాయం తెలుపుతూ ఈ క్యాలెండర్ ప్రచురించడం అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయుడు రామగోపాల్ పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అట్టహాసంగా అంజద్‌బాషా ఎన్నికల ప్రచారం


కడప దర్గాలో చాదర్ సమర్పించేందుకు వెళ్తున్న అంజద్ బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ అభ్యర్థి, డిప్యూటీ సీఎం అంజద్ బాషా తన ఎన్నికల ప్రచారాన్ని శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం తన ఇంటి నుంచి బయలుదేరిన అంజద్‌బాషాకు పార్టీ మహిళా కార్యకర్తలు, కుటుంబ సభ్యులు హారతులు పట్టారు. గుమ్మడికాయతో దిష్టితీశారు.

ఆ తర్వాత పెద్దదర్గాలో తన సోదరుడు ఎస్‌బి అహ్మద్‌బాషా, అల్లుడు ఉమైర్‌తో కలిసి గురువుల మజార్లకు పూల చాదర్లు సమర్పించి అంజద్ బాషా ప్రార్థనలు చేశారు. అనంతరం దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె సురేష్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అటునుంచి వైఎస్సార్ కాలనీకి చేరుకున్న ఆయనకు, మేయర్ సురేష్ బాబులకు 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, రైతు విభాగం నగర అధ్యక్షుడు రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. స్థానికులు బాణాసంచా కాల్చి, పూలు చల్లుతూ, డప్పు వాయిద్యాల నడుమ ఆహ్వానం పలికి, గజమాలతో ఘనంగా సత్కరించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం రెండు పర్యాయాలుగా కలిసివస్తున్న రెండో డివిజన్ వైఎస్సార్ కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల ప్రచారంలో పెద్ద ఎత్తున పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత

ఎర్రగుంట్ల : మండల పరిధి చిలంకూరులో ఉన్న ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ టీ చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ఏడాది విద్యా సంవత్సరంలో చిలంకూరుకు ప్రభుత్వ ఇంటర్ కళాశాలను మంజూరు చేయించారు. అయితే మొదటి సంవత్సరంలోని విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీ గ్రూపు గాయత్రి విద్యార్థిని 470కి 412 మార్కులు, ఎస్.ఆఫ్రిన్ 470కి 411 మార్కులు, సీఈసీ గ్రూపులో డి.భారతి 500కి 313 మార్కులు సాధించారన్నారు. అధ్యాపక బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో వందశాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు.


వందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు